
కొండారెడ్డిపల్లిలో మొక్క నాటుతున్న జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి

'స్వచ్ఛదనం.. పచ్చదనాన్ని' విజయవంతం చేయాలి

» జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి

కేశంపేట, ఆగస్టు 7: స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి వివరించారు. బుధవారం కేశంపేట మండలం కొండారెడ్డిపల్లి గ్రామాన్ని ఆయన సందర్శించారు. గ్రామంలోని డంపింగ్ యార్డు, నర్సరీని పరిశీలించారు. వన మహోత్సవంలో భాగంగా కేశంపేట మార్గంలో మొక్కలు నాటారు. అలాగే గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. గ్రామంలో స్వచ్ఛదనం, పచ్చదనం బాగుందని కితాబు నిచ్చారు. చెత్త సేకరణకు గ్రామ పంచాయతీ అవలంభిస్తున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. సీఈవో వెంట ఎంపీడీవో రవి చంద్రకుమార్ రెడ్డి, ఏపీవో అజీజ్, గ్రామ ప్రత్యేకాధికారి, ఏవో శిరీష, టీఏ నీలకంఠ బాబు తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న పాడి రైతులు

రోడ్డెక్కిన పాడి రైతులు

» పాల బిల్లులు చెల్లించాలని ఆందోళన

» రోడ్డుపై పాలు పారబోసి నిరసన

తలకొండపల్లి, ఆగస్టు 7 : పాల బిల్లుల చెల్లింపు విషయంలో తీవ్ర జాప్యాన్ని నిరసిస్తూ విజయ పాడిరైతులు రోడ్డెక్కారు. నాలుగు నెలలుగా బిల్లులు చెల్లించపోవడంతో ఆందోళనకు దిగారు. పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరుతూ మండలంలోని వెల్జాల్ గ్రామంలో ప్రధాన రహదారిపై బుధవారం సాయంత్రం పెద్దఎత్తున నిరసన చేపట్టారు. ప్రధాన రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. పాడి పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్న తమకు నెలల తరబడి బిల్లులు ఇవ్వడంలేదని ఆగ్రహం వ్యక్త చేశారు. రోడ్డుపై పాలు పారబోసి నిరసన తెలిపారు. బిల్లులు చెల్లించే వరకూ ధర్నాను విరమించేది లేదని మండిపడ్డారు. బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో దాణా కొనుగోలు, ఇతర ఖర్చులకు అప్పులు చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ పాల బిల్లులు వెంటనే విడుదల చేయకపోతే కడ్తాల పాల శీతలీకరణ కేంద్రాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పాడి రైతులు శేఖర్‌రెడ్డి, రమణ, పెంటయ్య, నిరంజన్, వెంకటయ్య, కృష్ణయ్య, శ్రీను, జగన్, రాములు, భాస్కర్‌రెడ్డి ఉన్నారు.


నృసింహస్వామి ఆలయ పైభాగాన్ని పరిశీలిస్తున్న అధికారులు

శిథిలావస్థకు చేరిన ఆలయాలను పునరుద్ధరిస్తాం

దేవాదాయ శాఖ ఇంజనీరింగ్ విభాగం డిప్యూటీ ఇంజనీర్ ఓంప్రకాష్

కొందుర్గు, ఆగస్టు 7: శిథిలావస్థకు చేరిన దేవాలయాలను పునరుద్ధరిస్తామని దేవాదాయ ధర్మదాయ శాఖ ఇంజనీరింగ్ విభాగం డిప్యూటీ ఇంజనీర్ ఓంప్రకాష్ అన్నారు. బుధవారం మండల కేంద్రానికి శివారులో ఉన్న పెంద్యాల గుట్టమీద శిథిలావస్థకు చేరిన శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవాలయాన్ని, మండల పరిధిలోని చెర్కుపల్లిలో ఉన్న వేంకటేశ్వరస్వామి దేవాలయాలను సహాయ స్థపతి శివకుమార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. రెండు ఆలయాలు శిథిలావస్థకు చేరుకున్నాయని.. పునరుద్ధరించేందుకు కావాల్సిన నమూనాలను తయారుచేసి ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. ఇన్‌చార్జి కార్యనిర్వాహణాధికారి శ్రీనివాసశర్మ, ఆలయాల ధర్మకర్తల మండలి చైర్మన్లు చేవెళ్ల కృష్ణయ్య, జీవన్‌కుమార్, సభ్యులు బోయ నర్సింలు, జె బాల్‌రాజ్, మాధవరెడ్డి, అమరలింగం, వేణుగోపాల్, గ్రామస్థులు కావలి యాదయ్య, కావలి లక్ష్మయ్య, బి.శ్రీశైలం, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడుల బలోపేతం కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఎట్టకేలకు బడుల్లో స్కావెంజర్ల నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతినిచ్చింది. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య సమస్య తీరనుంది. బడులకు స్కావెంజర్లను నియమిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఉపాధ్యాయుల సమావేశంలో ఇటీవల ప్రకటించారు. దీనికి అనుగుణంగా విద్యార్థుల సంఖ్యను బట్టి ఆయా పాఠశాలలకు నిధులు మంజూరు చేస్తూ జీవో విడుదల చేశారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో పరిసరాల పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణకు కార్మికులు అందుబాటులోకి రానున్నారు.


యాచారం మండలం కుర్మిద్ద హైస్కూల్ మరుగుదొడ్లలో మొలిచిన మొక్కలు

పారిశుధ్య సమస్యకు మోక్షం!

- ఆదర్శ కమిటీలకు పనుల అప్పగింత
- విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నిధులు
- ఉత్తర్వులు జారీ చేసిన సర్కార్
- ఇక తీరనున్న స్కావెంజర్ల సమస్య

ప్రభుత్వ బడులకు స్కావెంజర్లు

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 7 : కొన్నేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో శానిటేషన్ కార్మికులు లేక ఇబ్బందులు ఎదురయ్యాయి. ఎట్టకేలకు ప్రభుత్వం పాఠశాలల్లో స్కావెంజర్ల నియామకానికి ఆమోదం తెలుపుతూ జీవోను విడుదల చేసింది. మూడేళ్ల కిందట వారిని తొలగించడంతో అప్పటి నుంచి మున్సిపాలిటీలు, పంచాయతీలే ఆ పనులను పర్యవేక్షిస్తున్నాయి. అయితే, పంచాయతీ, మున్సిపల్ కార్మికులు వారి పనులు చూసుకోవడంతో పాటు ఇక్కడకు రావాల్సి ఉంది. దీంతో వారు పాఠశాలలకు సమయానికి రాకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. కొన్నిచోట్ల ఉపాధ్యాయులు, విద్యార్థులే మరుగుదొడ్లు శుభ్రం చేసుకుంటున్న సందర్భాలు కూడా ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో సీఎం తీసుకున్న నిర్ణయంతో ప్రభుత్వ పాఠశాలలు, ఆదర్శ పాఠశాలలకు మంచి రోజులు రానున్నాయి. ఇక స్కావెంజర్ల సమస్య తీరనుందని ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 1338 పాఠశాలలున్నాయి. అందులో 20 కేజీబీవీలు, 9 ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. కేజీబీవీల్లో 6-12 తరగతి వరకు 6,027 మంది బాలికలున్నారు. అందులో 11 కేజీబీవీల్లో ఇంటర్ విద్య కొనసాగుతోంది. వాటిలో 1,45,619 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించినా నిర్వహణకు సరిపడా నిధుల్లేక ప్రధానోపాధ్యాయులు, సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. ప్రధానంగా విద్యుత్ బిల్లుల భారంతో పాటు పారిశుధ్య నిర్వహణకు సిబ్బందిని నియమించకపోవడంతో అనేకపాట్లు పడ్డారు. అటెండర్లు లేక పాఠశాలలను పరిశుభ్రం చేసేవారు కరువయ్యారు. ప్రభుత్వం ప్రతీ ఏటా పాఠశాలల నిర్వహణకు అరకొరగా ఇచ్చే గ్రాంట్లు సరిపోక నానా కష్టాల పాలయ్యారు. ఇక నుంచి పాఠశాలలకు ఉచితంగా విద్యుత్ ఇస్తామని, పాఠశాలల నిర్వహణకు ఇచ్చే గ్రాంటు పెంచుతామని ఈ నెల 2వ తేదీన పదోన్నతి పొందిన ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆ మేరకు పాఠశాలల నిర్వహణకు విద్యార్థుల సంఖ్యను బట్టి నెలకు రూ.3వేల నుంచి 20 వేల రూపాయలు విడుదల చేయనున్నట్లు రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశ్ జీవో నంబరు 21 ద్వారా ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో అటెండర్లు, స్వీపర్లు లేక మరుగుదొడ్ల నిర్వహణ, పరిసరాలను పరిశుభ్రం చేసే వాళ్లు లేకుండా పోయారు. వీటి నిర్వహణకు గత ప్రభుత్వ హయాంలో ప్రతి పాఠశాలకు ఒక స్కావెంజర్‌ను నియమించుకునే అవకాశం కల్పించి నెలకు 2,500 రూపాయలు ఇచ్చారు. 2020 మార్చిలో కరోనా ప్రబలడంతో రెండేళ్ల వరకు సక్రమంగా పాఠశాలలు నడవలేదు. కరోనా అనంతరం స్కావెంజర్లకు బదులు, పాఠశాలలను పరిశుభ్రం చేసే బాధ్యతను పంచాయతీలు, మున్సిపాలిటీలకు అప్పగించింది. అయితే, అది విజయవంతం కాలేదు. దీంతో పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణకు స్వీపర్లు, స్కావెంజర్లను ఇవ్వాలని కోరినా పట్టించుకోలేదు. ఈ విషయాన్ని గమినించిన ప్రస్తుత ప్రభుత్వం నిర్వహణ గ్రాంటును పెంచింది. ఈ నిధులతో పాఠశాలల్లోని మరుగుదొడ్లను శుభ్రం చేయడం, మొక్కలకు నీళ్లు పోయడం, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ఈ పనులు చేసేందుకు సర్వీస్ వర్కర్లు, స్కావెంజర్లను నియమించుకోవాలన్నారు. ఆయా పాఠశాలలకు కేటాయించే నిధులను మూడు నెలలకు సంబంధించి అడ్వాన్స్‌గా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఖాతాల్లో జమ చేయాలని, ఇందు కోసం జిల్లా మినరల్ ఫండ్ ట్రస్ట్ (డీఎంఎఫ్‌టీ) నిధులను సద్వినియోగం చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పాఠశాల నిర్వహణ బాధ్యతను అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలకు అప్పగించారు.

ప్రభుత్వం ఇచ్చే నిధులిలా (రూపాయల్లో)

విద్యార్థులు	నెలకు
1-30	3,000
31-100	6,000
10-250	8,000
251-500	12,000
501-750	15,000
750కి పైగా	20,000


అరుబయట మూత్ర విసర్జన చేస్తున్న విద్యార్థులు

విద్యుత్ బిల్లుల భారం..

ఒక్కో ప్రభుత్వ పాఠశాలకు నెలకు రూ.200 నుంచి 8వేల రూపాయల వరకు విద్యుత్ బిల్లులు వస్తుంటాయి. ప్రాథమిక పాఠశాలల్లో ఒకటి, రెండు గదులు, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 4 నుంచి 6 వరకు గదులు, ఉన్నత పాఠశాలల్లో 10కి పైగా గదులు ఉంటాయి. వీటిలో బల్బులు, ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్లు, జలశుద్ధి యంత్రాలు, బోర్ మోటార్లు, కంప్యూటర్, సైన్స్ ల్యాబ్‌లు, డిజిటల్ తరగతుల నిర్వహణకు విద్యుత్ అవసరం ఉంటుంది. పాఠశాలలను బట్టి వస్తున్న కరెంట్ బిల్లులను చెల్లించలేక ఉపాధ్యాయులు సతమతం అవుతున్నారు. ప్రస్తుతం నిర్వహణ నిధులు పోనూ ఉచితంగా విద్యుత్ ఇస్తామని సీఎం హామీ ఇవ్వడంతో ఉపాధ్యాయులు ఊపిరి పీల్చుకుంటున్నారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులు త్వరలోనే వెలువడనున్నాయని విద్యాశాఖ వర్గాలు పేర్కొన్నాయి.

పరిశుభ్రమైన వాతావరణం కోసం..

పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలదే. సమగ్ర శిక్ష కింద అందిస్తున్న కాంపోజిట్ స్కూల్ గ్రాంటుకు అదనంగా ఈ గ్రాంట్ అందిస్తున్నారు. పాఠశాలలలో పరిశుభ్రమైన వాతావరణం అందించడంతో పాటు మరుగుదొడ్లు శుభ్రపర్చడం, మొక్కలకు నీరు పోయడం వంటి వాటికి ఈ నిధులను వినియోగించుకోవాలి. క్లీనింగ్, స్వీపింగ్ మొదలైన వాటికి అవసరమైన మెటీరియల్ ఖర్చు కోసం సమగ్ర శిక్ష కింద పాఠశాలకు విడుదల చేసి కాంపొజిట్ స్కూల్ గ్రాంట్‌ను వినియోగించుకోవడానికి అవకాశముంది.


కేశంపేట మండలం సంగెం యూపీఎస్‌లో మరుగుదొడ్ల పరిస్థితి


ఆమనగల్లు బస్టాండ్ పాఠశాలలో అస్తవ్యస్తంగా ఉన్న మరుగుదొడ్లు

సంతోషంగా ఉంది



కొన్నేళ్లుగా పాఠశాలల్లో స్కావెంజర్లు లేక ఇబ్బందులు పడ్డాం. ప్రస్తుతం వారి నియామకానికి ప్రభుత్వం ఆమోదం తెలపడంతో సంతోషంగా ఉంది. ఇక పాఠశాలల ఆవరణలు పరిశుభ్రంగా మారనున్నాయి. స్కావెంజర్ల సమస్య తీరింది. ఇప్పటికే గృహ విద్యుత్ వినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పిస్తుంది. ఇక పాఠశాలలకు ఉచిత విద్యుత్ ఇవ్వనున్నట్లు సీఎం ప్రకటించడం హర్షణీయం.

- రఘునందరెడ్డి, టీయూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి


విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ విజయలక్ష్మి

విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి

కొందుర్గు, ఆగస్టు, 7: విద్యార్థులు తప్పనిసరిగా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని 101 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 20 మంది విద్యార్థులకు జ్వరం, జలుబు ఉందని నిర్ధారించారు. దీంతో వారికి కావలసిన మందులను అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు భోజనం చేసే సమయంలో తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకోవాలని తెలిపారు. వంటశాలలను పరిశీలించారు. ప్రతీ రోజు కూరగాయలను పరిశుభ్రం చేసి వండాలని సూచించారు. అంతకు ముందు మండల పరిధిలోని శ్రీరంగాపూర్, తంగళ్లపల్లి గ్రామాల్లోని సబ్‌సెంటర్లను డిప్యూటీ డీఎంహెచ్‌వో పరిశీలించారు. ప్రతీ బుధ, శనివారాలు గర్భిణులకు, చిన్నారులకు ఇచ్చే వ్యాక్సిన్లను వ్యాక్సిన్ క్యారియర్‌లో కోల్డ్‌చైన్ మెయింటెన్ చేస్తూ సమయపాలన పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ అమృతాజోసఫ్, వార్డెన్ రఘురాం, హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు, వైద్య సిబ్బంది లాధియా, కె.శ్రీనివాసులు, రాఘవులు, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

» కలెక్టర్ శశాంక


కోనాపూర్ పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక

ఆమనగల్లు/రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 7: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచి పాఠశాలలను బలోపేతం చేయాలని కలెక్టర్ శశాంక కోరారు. స్థానికుల సహకారం, ఉపాధ్యాయుల పనితీరుపైనే ప్రభుత్వ పాఠశాలల మనుగడ ఆధారపడి ఉందన్నారు. ఈనేపథ్యంలో వారంతా కలిసి పాఠశాలలను అభివృద్ధి పరుచుకోవాలని ఆయన సూచించారు. ఆమనగల్లు మండలంలో బుధవారం కలెక్టర్ శశాంక పర్యటించారు. ఆకుతోటపల్లిలో నిర్వహించిన స్వచ్ఛనం - పచ్చదనం కార్యక్రమంలో పాల్గొని అధికారులు, కూలీలతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం కోనాపూర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన సందర్శించారు. డీఈవో సుశీందర్‌రావుతో కలిసి ఆ పాఠశాలల రికార్డులను, గదులు, పరిసరాలను పరిశీలించారు. పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని, వంటగది, మరుగుదొడ్లు, మూత్రశాలలను మరమ్మత్తు చేయాలని, క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులు, స్థానికులు కలెక్టర్‌ను కోరారు. దీంతో స్పందించిన కలెక్టర్ పాఠశాలలో 31 మంది విద్యార్థులు మాత్రమే ఉండడంతో విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల సంఖ్య పెరిగితే అందుకనుగుణంగా వసతుల కల్పనకు వీలు కలుగుతుందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచి తల్లిదండ్రులకు మరింత విశ్వాసాన్ని కల్పించడం ద్వారా విద్యార్థుల సంఖ్య పెంపునకు దోహద పడుతుందని శశాంక తెలిపారు. కోనాపూర్ పాఠశాలలో కల్పించాల్సిన వసతుల కల్పనకు ప్రతిపాదనలు రూపొందించాలని ఎంఈవో సర్దార్‌నాయక్‌ను కలెక్టర్ ఆదేశించారు. ప్రజల భాగస్వామ్యం, పర్యవేక్షణతోనే ప్రగతి సాధ్యమని ఆయన పేర్కొన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలు పనిచేసిన రోజులకు సంబంధించిన వివరాల స్లిప్‌లను అందించి వారికి సకాలంలో కూలి డబ్బులు అందేలా చూడాలని డీఆర్‌డీవో శ్రీలత, ఎంపీడీవో కుసుమ మాధురిలను ఆదేశించారు. పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మొక్కల పెంపకం లక్ష్యాల పూర్తికి అధికారులంతా ప్రత్యేక చొరవ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా కోనాపూర్ గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం, అనుపత్రి ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను గ్రామస్తులు కోరగా సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో డీపీవో, డీడబ్ల్యూవో పద్మజ రమణ, మండల ప్రత్యేక అధికారి సుజాత, తహసీల్దార్ లలిత, ఎంపీడీవో కుసుమమాధురి, ఎంఈవో సర్దార్ నాయక్, ఎంపీవో వినోద, ఏపీవో మాధవరెడ్డి, సీడీపీవో శాంతిరేఖ, ఏవో అరుణకుమారి పాల్గొన్నారు.

చెరువులు కబ్జాకు గురికాకుండా చూడాలి

జిల్లాలోని చెరువులు కబ్జాకు గురికాకుండా చూడాలని కలెక్టర్ శశాంక ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో మున్సిపల్ కమిషనర్లు, ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని చెరువులు కబ్జాకు గురికాకుండా ఎఫ్‌టీఎలను గుర్తించాలని తెలిపారు. ప్రభుత్వ భూములను రక్షించే బాధ్యత అధికారులపై ఉందన్నారు. చెరువులను జాయింట్ సర్వే నిర్వహించి ఎఫ్‌టీఎలను, బఫర్లను గుర్తిస్తూ కడ్డీలను, సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. అనంతరం లే అవుట్ రూల్స్ రెగ్యులరైజేషన్‌పై సమావేశాన్ని నిర్వహించారు. ఎల్ఆర్ఎస్ అప్లికేషన్ ప్రక్రియను సరళీకృతం చేయడానికి, క్రమబద్ధీకరించేందుకు సీజీజీ ద్వారా పారదర్శక ఆన్‌లైన్ సాధనం రూపొందించాలని తెలిపారు. హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న లేఅవుట్ల క్రమబద్ధీకరణకు మున్సిపల్ కమిషనర్లకు, మున్సిపల్ పరిధిలో లేనివి జిల్లా కలెక్టర్ పరిధిలోకి వస్తాయని కలెక్టర్ తెలిపారు. ఎల్ఆర్ఎస్‌లో ప్లాట్ క్రమబద్ధీకరణకు మూడుస్థాయిల్లో పరిశీలన చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, భూపాల్‌రెడ్డి, ఆర్డీవోలు సూరజ్‌కుమార్, అనంతరెడ్డి, వెంకట్‌రెడ్డి, సాయిరాం, వేణుమాధవ్, తహసీల్దార్లు, ఇరిగేషన్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ మిషన్ భగీరథ అధికారుల బదిలీలు

యాచారం, ఆగస్టు 7: మండలానికి చెందిన ఆర్‌డబ్ల్యూఎస్ మిషన్ భగీరథ అధికారులు బదిలీ అయ్యారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రజిత ఇబ్రహీంపట్నంకు బదిలీ కాగా, మిషన్ భగీరథ ఏఈ అనిరుధ్ ఈఎన్‌సీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా సుభాష్ దేవరకొండ నుంచి బదిలీపై వచ్చారు.

మిషన్ భగీరథ ఏఈగా ప్రణయ్ కల్వకుర్తి నుంచి బదిలీపై వచ్చారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.

స్థానికతపై జీవో 33 సమగ్రంగా లేదు

- కాంగ్రెస్ అనాలోచిత నిర్ణయాలతో తెలంగాణ బిడ్డలకు నష్టం
- కేంద్రం గ్రామాలకు ఇచ్చిన నిధులను దారి మళ్లించారు: హరీశ్

హైదరాబాద్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు తెలంగాణ బిడ్డలకు నష్టం కలిగిస్తున్నాయని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఎంబీబీఎస్ అడ్మిషన్ల విషయంలో జారీ చేసిన జీవో 33 సమగ్రంగా లేదని, తెలంగాణ బిడ్డలే నాన్ లోకల్ అవుతున్నారన్నారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి సర్కారు గుడ్డెద్దు చేలో పడ్డట్టు వ్యవహరిస్తోందన్నారు. 2024 జూన్ 2 నాటికి తెలంగాణ ఏర్పడి పదేళ్లు పూర్తికావడంతో స్థానికత నిర్ధారణకు సొంత నిబంధనలు రూపొందించుకోవడానికి రాష్ట్రానికి అవకాశం దక్కిందన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ బిడ్డలకు విద్యా సంస్థల్లో ప్రవేశాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ఆలోచన చేసి, నిబంధనలు తయారు చేయాల్సి ఉండగా.. అలాంటిదేం లేకుండా ఎంబీబీఎస్ అడ్మిషన్ల కోసం 33 జీవో తెచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏ అంశంలోనూ సరిగా అవగాహన లేదని, అందుకే 9 నుంచి 12వ తరగతి వరకు ఎక్కడ చదివితే దాన్నే స్థానికతగా నిర్ణయిస్తూ జీవో తెచ్చిందన్నారు. దీని వల్ల తెలంగాణ బిడ్డలు స్థానికేతరులుగా మారే ప్రమాదం ఉందన్నారు. కేసీఆర్ హయాంలో 95 శాతం స్థానికులకు ఉద్యోగాలు దక్కేలా విధానాలు తెచ్చారని, అదే పద్ధతి విద్య విషయంలోనూ అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ వచ్చాక ఏర్పాటుచేసిన వైద్య కళాశాలల్లో స్థానికేతర విద్యార్థులకు రిజర్వేషన్ అమలు చేయలేదని, స్థానికులకే సీట్లు దక్కేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కనీస నిధులైనా ఇవ్వకపోతే పంచాయతీలు స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం ఎలా నిర్వహిస్తాయని ప్రశ్నించారు. ఉపాధి హామీ, ఆరోగ్య మిషన్ వంటి పథకాల కింద కేంద్రం ఇచ్చిన రూ.2100 కోట్లను గ్రామాలకు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం దారి మళ్లించిందని, దీంతో కేంద్రం నుంచి రావాల్సిన మరిన్ని నిధులకు బ్రేక్ పడిందన్నారు. కాంగ్రెస్ పాలన చేపట్టిన 8 నెలల్లో పంచాయతీలకు పైసా కూడా ఇవ్వలేదన్నారు.

గాంధీ, ఉస్మానియా ఆస్పత్రుల్లో 235 వైద్య పోస్టుల భర్తీ

- రేపు వాకిన్ ఇంటర్వ్యూల నిర్వహణ

హైదరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): గాంధీ, ఉస్మానియా ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపాదికన భర్తీ చేయనున్నారు. ఈమేరకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. మొత్తం 235 మంది వైద్యుల పోస్టులను ఈ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయనున్నారు. ఉస్మానియా వైద్య కళాశాలలో ప్రొఫెసర్ పోస్టులు-8, అసోసియేట్ ప్రొఫెసర్-23, అసిస్టెంట్ ప్రొఫెసర్లు-111, సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు-33 ఉన్నాయి. గాంధీలో ప్రొఫెసర్ పోస్టులు-3, అసిస్టెంట్ ప్రొఫెసర్లు-29, సీనియర్ రెసిడెంట్స్-24, ట్యూటర్లు-4 పోస్టులున్నాయి. ఈ పోస్టులను వాకిన్ ఇంటర్వ్యూ పద్ధతిలో భర్తీ చేయనున్నారు. ఈమేరకు 9న ఈ ఇంటర్వ్యూలను నిర్వహిస్తారు. 12న ధ్రువపత్రాల పరిశీలన, 13న అభ్యంతరాల స్వీకరణ, 14న ఎంపిక ప్రక్రియ ఉంటుందని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఇంటర్వ్యూలను గాంధీ మెడికల్ కాలేజీలో వైద్యవిద్య సంచాలకులు డాక్టర్ వాణి, ఉస్మానియా మెడికల్ కాలేజీలో తెలంగాణ వైద్యవిధాన పరిషత్ కమిషనర్ సమక్షంలో నిర్వహించనున్నారు. ఈ నియామకాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహా అధికారులను ఆదేశించారు. నియామకాలు పారదర్శకంగా జరిగేలా హైదరాబాద్ జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, డీఎంఈ, టీవీవీపీ కమిషనర్‌లను నోడల్ అధికారులుగా నియమిస్తూ సర్కారు జీవో జారీ చేసింది.

ఆ ఆస్పత్రుల్లో వైద్యులు పెరిగారు

కాగా వైద్య ఆరోగ్యశాఖలో ఇటీవల చేపట్టిన సాధారణ బదిలీలతో ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల్లో వైద్యుల కొరత నెలకొందన్న వార్తల నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ దానిపై స్పష్టతనిచ్చింది. దీర్ఘకాలం ఒకే చోట ఉన్న వారిలో 40 శాతం మందిని బదిలీ చేయాలని జీవో 80 చెబుతోందని, ఆ మేరకే బదిలీలు చేపట్టామని ఉన్నతాధికారులు చెబుతున్నారు. బదిలీలతో గాంధీ, ఉస్మానియా ఆస్పత్రుల్లో రోగులకు అందుతున్న వైద్యసేవలపై ప్రభావం లేదని, ఆ రెండింట్లో గతం కంటే వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది ఉన్నారన్నారు. ఉస్మానియాలో గతేడాది 169 మంది డాక్టర్లు, 247 మంది నర్సులుంటే.. ప్రస్తుతం 266 మంది వైద్యులు, 263 నర్సులున్నారని వైద్య ఆరోగ్య శాఖ తెలిపింది. ఇక గాంధీలో ఇంతకు ముందు 295 మంది డాక్టర్లు, 191 మంది నర్సులుండగా..ప్రస్తుతం 362 మంది వైద్యులు, 287 మంది నర్సులున్నారని వెల్లడించింది.



భూముల సర్వేకు డ్రోన్లు

ప్రత్యేయ యాప్‌తో అనుసంధానం.. జియో ట్యాగింగ్‌తో ఫొటోలు

- గంటలో 100 ఎకరాల దాకా కొలతలు
- ఐఐటీ హైదరాబాద్ పరిశోధకుల రూపకల్పన
- దేశంలో తొలి సర్వే డ్రోన్‌గా గుర్తించిన కేంద్ర సర్కారు


గాల్లో ఎగురుతూ ఫొటోలు తీస్తున్న డ్రోన్

కంది, ఆగస్టు 7: భూములను గొలుసులతో కొలవడం సంప్రదాయ పద్ధతి! దీనికి మనుషులు ఎక్కువే అవసరం. సమయమూ బాగానే పడుతుంది. ఎకరం-రెండకాలను కొలిచేందుకు గంటకు పైగా పడుతుంది. డిజిటల్ యంత్రాలు వచ్చేశాయ్.. కాబట్టి మనుషులు తక్కువ అవసరం.. సమయమూ కొంత తగ్గింది! మరి.. ఒకే ఒక గంటలో 100 ఎకరాల భూమిని సర్వే చేయగలిగేలా వ్యవస్థ ఏదైనా అందుబాటులోకొస్తే? అద్భుతమే కదా! ఆ వ్యవస్థ వచ్చేసింది. అదే.. డ్రోన్లద్వారా భూ సర్వే పద్ధతి! సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్ ఏరోనాటికల్ ఇంజనీరింగ్ పరిశోధకులు భూములను సర్వే చేసేందుకు ప్రత్యేక డ్రోన్లను రూపొందించారు. ఈ డ్రోన్లను మార్కెట్లోకి ప్రవేశపెట్టడానికి ఐఐటీ-హెచ్‌లోని ఇంక్యూబేషన్ విభాగం అధికారులు క్రిస్టల్‌బాల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెంట్ ప్రైవేట్ లిమిటెడ్‌తో భాగస్వామ్యంతో స్టార్టప్ కంపెనీ ప్రారంభించారు. ఈ డ్రోన్‌లను డీజీసీఏ (డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్) అంగీకరించింది. భూముల సర్వేలో దీని పనితీరు పరిశీలించిన కేంద్ర ప్రభుత్వం ఈ డ్రోన్లను సర్వే డ్రోన్లుగా గుర్తించింది. ఫలితంగా దేశంలోనే తొలి సర్వే డ్రోన్‌గా గుర్తింపు పొందింది. మోడల్-వీ పేరుతో తయారుచేసిన ఈ డ్రోన్లు సెకండ్‌కు 8 మీటర్లు ఎత్తుకు ఎగురుతాయి. ఒకసారి చార్జింగ్ చేస్తే 50 నిమిషాల పాటు గాలిలోనే ఎగరగల సామర్థ్యంతో వీటిని తయారు చేశారు. భూ సర్వేపై రూపొందించిన ఓ ప్రత్యేక యాప్‌ను అనుసంధానం చేస్తే గాల్లోకి ఎగిరి జియో టాగింగ్‌తో ఫొటోలు తీసి సర్వే హద్దుల వివరాలను పక్కాగా వెల్లడిస్తుంది. ఈ డ్రోన్ల తయారీ కోసం 32మంది ఏరోనాటికల్ ఇంజనీరింగ్ విద్యార్థులను ఉద్యోగులుగా నియమించుకున్నారు. ఈ డ్రోన్లతో భూ సర్వేలు అత్యంత వేగంగా చేయవచ్చునని పరిశోధకులు చెబుతున్నారు. వీటితో పాఠశాల విద్యార్థులకు వివిధ రకాలుగా పాఠ్యాంశాలు కూడా బోధించవచ్చునని తెలిపారు. గుజరాత్ ప్రభుత్వం రెండు నెలల క్రితం ఇదే స్టార్టప్ కంపెనీ ద్వారా 100 డ్రోన్లను కొనుగోలు చేసింది. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు ఈ సర్వే డ్రోన్లు 300 వరకు అమ్ముడయ్యాయని తెలిసింది. అతి త్వరలోనే గాల్లో గంటసేపు ఎగిరే సామర్థ్యంతో పంట పొలాల్లో మందులు పిచికారి చేసే డ్రోన్లు, సర్వేలెన్స్ డ్రోన్లు అందుబాటులోకి రానున్నాయని పరిశోధకులు వెల్లడించారు. మంగళవారం సంగారెడ్డి పరిధిలోని కందిలో ఈ డ్రోన్లను ఐఐటీ-హెచ్ స్టార్టప్ కంపెనీ ఉద్యోగులు గాల్లోకి ఎగరవేసి వాటి పనితీరును పరీక్షించారు.

డ్రోన్లతో సర్వే ఇలా..

భూ సర్వే కోసం తొలుత ఈ డ్రోన్‌లకు మొబైల్ ఫోన్‌లో 'మిషన్ ప్లానర్' లేదా 'ల్యాండ్ మెజర్‌మెంట్' యాప్‌లను అనుసంధానం చేయాలి. తర్వాత స్థలం యజమాని చూపించే భూమి హద్దులను బట్టి ఆ యాప్ ద్వారా ఒక బెంచ్ మార్కును గీస్తారు. ఆ యాప్‌లోని కేఎంఎల్ (కీహోల్ మార్కప్ లాంగ్వేజ్) ద్వారా హద్దులను గుర్తించి సర్వే చేయాలనుకున్న ప్రదేశాన్ని మొత్తం చతురస్రాకారంలో ఒక రూట్ మ్యాప్ తయారు చేస్తారు. ఆ మ్యాప్‌తో డ్రోన్‌ని గాల్లోకి వదులుతారు. కేఎంఎల్ ఆధారంగా ఆ డ్రోన్ తీసే ఫొటోలకు మిషన్ ప్లానర్ యాప్‌లో గూగుల్‌లోని సర్వే ప్రదేశం ఉన్న విలేజ్ మ్యాప్‌ను అనుసంధానం చేసి రిపోర్ట్ ఇస్తారు. ఈ సాంకేతికతతో గంటకు 100 ఎకరాలు సర్వే చేయవచ్చునని పరిశోధకులు చెబుతున్నారు. ఈ డ్రోన్లతో భూముల సర్వేతో పాటు కొండలు, గుట్టలు, బురద ప్రాంతాలు, నీటి కుంటలు లాంటి ప్రదేశాల్లో సులువుగా కొలతలు తీయొచ్చు. డ్రోన్ కెమెరాల్లో వాడే కెమెరా మ్యాడ్యూల్‌ను బట్టి మైనింగ్‌లలో, పవర్ ప్లాంట్లు, రైల్వే ట్రాక్ కూడా సర్వే చేయొచ్చునని వారు తెలిపారు.

గత సర్కారు నిర్వాకంతో
పంచాయతీలకు ఇక్కట్లు

- మీ హయాంలో సర్పంచుల ఆత్మహత్యలు చేసుకున్నారు..
- హరీశ్ మర్చిపోయారా?: మంత్రి సీతక్క



హైదరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ నిర్వాకంవల్లే గ్రామ పంచాయతీలకు ఇక్కట్లు ఎదురవుతున్నాయని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై మాట్లాడే హక్కు వారికి లేదని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క ధ్వజమెత్తారు. స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో కనీసం పాల్గొనకుండా రాజకీయాలు చేయడం హరీశ్‌రావుకు తగదన్నారు. 'పదే పదే అబద్ధాలు చెబితే ప్రజలు నమ్మరు. మీ ప్రభుత్వ హయాంలోనే సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకున్న విషయం మర్చిపోయారా?' అని నిలదీశారు. ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలను బుధవారం మంత్రి సీతక్క ఓ ప్రకటనలో ఖండించారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు రూ.10,170 కోట్లు కేటాయించి రూ.5,988కోట్లే విడుదల చేసిందన్నారు. పంచాయతీలకు 44శాతం నిధులివ్వకుండా గత ప్రభుత్వం సొంత అవసరాలకు వాడుకుందని ఆరోపించారు. నేషనల్ రూర్బన్ (రూరల్ అర్బన్) మిషన్‌కు 2019 నుంచి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం కోల్పోయేనాటికి రూ.1,200 కోట్లు చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టిందన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ కింద చేయించిన పనులకు సంబంధించి ఆరేళ్లుగా రూ.940 కోట్లు, రూరల్ ఇంజనీరింగ్ విభాగానికి రూ.600కోట్ల బిల్లులు చెల్లించలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2018 నూతన పంచాయతీ చట్టం ద్వారా అడ్వర్టైజింగ్, మైనింగ్ వంటి పన్నులను పంచాయతీలకు రాకుండా చేసిందని, పంచాయతీలను ఆదుకోకపోగా ఆర్థికంగా మరింత దెబ్బతీశారని ఆమె ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సిఫారసుల ప్రకారం పంచాయతీలకు నిధులు కేటాయించలేదన్నారు. కేసీఆర్ జన్మదినం కోసం ఫిబ్రవరిలో మొక్కలు నాటించారని విమర్శించారు. కాగా మూడు రోజుల్లోనే 25 లక్షల మొక్కలు నాటించామని, 29 వేల కిలోమీటర్ల రహదారులు, 18 వేల కిలోమీటర్లకుపైగా డ్రైనేజీ కాలువలను శుభ్రపరిచామని, ఇది బీఆర్ఎస్ నేతలకు కనబడటంలేదని సీతక్క పేర్కొన్నారు.

పోలీస్ శాఖలో పనిచేయడం వరం


సమావేశంలో మాట్లాడుతున్న డీటీసీ జిల్లా అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు

వికారాబాద్, ఆగస్టు 7: పోలీస్ శాఖలో పనిచేయడం దేవుడిచ్చిన వరమని డీటీసీ జిల్లా అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బుధవారం డీటీసీ ప్రిన్సిపాల్ పవీ.మురళీధర్ ఆధ్వర్యంలో డీటీసీలో శిక్షణ పొందుతున్న వారికి సూచనలు చేశారు. శిక్షణానంతరం కొందరు గ్రేహౌండ్స్ ఆక్టోపస్ విభాగాల్లోనూ పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఈ విభాగాల్లోనూ బాగా పనిచేసి పోలీసు శాఖకు పేరు తేవాలన్నారు. ఈ విభాగంలో పనిచేసేందుకు ఇష్టం ఉన్న వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. గురువారం వారికి పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆక్టోపస్ విభాగం ఆర్ఎస్ఐ మహేష్, ప్రిన్సిపాల్ మురళీధర్ పాల్గొన్నారు.

పీడీఎస్ వ్యాపారులపై టాస్క్‌ఫోర్స్ దాడులు


పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

వికారాబాద్, ఆగస్టు 7: పీడీఎస్ బియ్యాన్ని కొని వ్యాపారం చేస్తున్న వారిపై బుధవారం దాడులు చేసి 6 కేసులు నమోదు చేశామని జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి వెంకటేశం తెలిపారు. పీడీఎస్ బియ్యాన్ని ఎవరూ అక్రమంగా తరలించొద్దన్నారు. కొడంగల్, యాలాల్ మండలాల్లో దాడులు చేశామన్నారు. కొడంగల్ పరిధిలో ఐదుగురు వ్యాపారులను, యాలాల్ పరిధిలో ఒకరి అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేసి మొత్తం 35 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై మధుసూదన్‌రెడ్డి

పూడూరు/బొంరాస్‌పేట్, ఆగస్టు7: మండల పరిధి మోడల్ స్కూల్ విద్యార్థులకు చెన్‌గోముల్ పోలీసులు అవగాహన కల్పించారు. బుధవారం విద్యార్థులకు డయల్ 100, బాల్య వివాహాల నివారణ, రోడ్డు ప్రమాదాలు, సైబర్‌నేరాలు తదితరాలపై ఎస్సై మధుసూదన్‌రెడ్డి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ పెంటయ్య, కానిస్టేబుళ్లు నిరంజన్, శివకుమార్, అంజి తదితరులు పాల్గొన్నారు. ప్రతీ ఒక్కరు చట్టాలపై అవగాహన ఉండాలని బొంరాస్‌పేట్ ఎస్సై అబ్దుల్ రవూఫ్ అన్నారు. నాగిరెడ్డిపల్లిలో గ్రామస్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యార్థులు కీడల్లోనూ రాణించాలి


నాగేంద్రను సన్మానిస్తున్న ఎంపీడీవో గాలి యాదయ్య, ఉపాధ్యాయులు

బషీరాబాద్/తాండూరు రూ రల్, ఆగస్టు 7: విద్యార్థులు చదువుతో పాటు క్రీడాల్లోనూ రాణించాలని రంజీ క్రికెటర్ నాగేంద్ర అన్నారు. బుధవారం బషీరాబాద్ మండలానికి వచ్చిన ఆయన ఎం పీడీవో గాలి యాదయ్యతో కలిసి బాలు రు ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో సమావేశమయ్యారు.తన బాల్యం, చదువుతో పాటు క్రికెట్‌లో ఎలా రాణించానో విద్యార్థులకు వివరించారు. అనంతరం క్రికెటర్‌ను ఎంపీడీవో యాదయ్య సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి జయకార్, ఉపాధ్యాయులు పలువురు పాల్గొన్నారు. అలాగే తాండూరు మండలం అంతారం తండా భూకైలాస్ ఆలయాన్ని క్రికెటర్ నాగేందర్ సందర్శించారు. ఆలయంలో మహాశివుడికి పూజలు చేశారు. తాండూరుకు 5కిలోమీటర్ల దూరంలో ఉన్న భూకైలాశ్ ఆలయం వద్ద ఆహ్లాదకర వాతావరణం ఉందన్నారు. తర్వాత పాఠశాలను సందర్శించి, ఆయనతో రవిశంకర్, టీచర్లు, పంచాయతీ కార్యదర్శి అంబిక ఉన్నారు.

ప్రభుత్వ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరిక

- చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య, మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి
- కాంగ్రెస్‌లో చేరిన రామన్నగూడ మాజీ సర్పంచ్


ఎమ్మెల్యే యాదయ్య, మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న మాజీ సర్పంచ్ లావణ్యశంకర్

చేవెళ్ల, ఆగస్టు 7 : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నేతలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య, చేవెళ్ల మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి తెలిపారు. బుధవారం చేవెళ్ల మండల పరిధిలోని రామన్నగూడ గ్రామం మాజీ సర్పంచ్ ఎస్.లావణ్య శంకర్‌తోపాటు మరో 50 మంది నాయకులు బీఆర్ఎస్‌ను వదిలి కాంగ్రెస్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద చేరారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి ఇతర పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని చెప్పారు. పార్టీలో చేరిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని, ప్రభుత్వ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీనియర్ నాయకులు సున్నపు వసంతం, ఎం.కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు దేవర వెంకట్‌రెడ్డి, నక్క బుచ్చిరెడ్డి, పార్టీ అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, నాయకులు బండారు ఆగిరెడ్డి, పెంటయ్యగౌడ్, ప్రభాకర్, శ్రీశైలం, విఠలయ్య, రాంరెడ్డి, నర్సింలు, సుధాకర్, శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, వాజిత్, తాజ్, రషీత్, మల్లేష్, రవి, మధుసూదన్‌రెడ్డి, షబ్బీర్, మహేందర్, అనిల్, చింటు, రోహిత్, నాగరాజు, రవి, బాలయ్య, ఉస్మాన్, శివ, తదితరులు ఉన్నారు.

సీఎం సహాయనిధి నిరుపేదలకు వరం

షాబాద్: సీఎం సహాయనిధి నిరుపేదలకు వరంలాంటిదని ఎమ్మెల్యే యాదయ్య, మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. చేవెళ్ల క్యాంపు కార్యాలయంలో మండల పరిధిలోని కుర్వగూడ గ్రామానికి చెందిన శివశంకర్‌యాదవ్‌కు రూ.32 వేల సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును వారు అందజేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని, రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసి చరిత్రలో నిలిచారన్నారు. మాజీ సర్పంచ్ చందిప్ప జంగయ్య, గ్రామస్థులు భాస్కర్‌గౌడ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే మానవ అక్రమ రవాణా కట్టడి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ వెంకన్న

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 7: ప్రజలందరూ అప్రమత్తంగా వ్యవహరిస్తేనే మానవ అక్రమ రవాణా అరికట్టబడుతుందని షాద్‌నగర్ మున్సిపల్ కమిషనర్ వెంకన్న అన్నారు. హైదరాబాద్‌కు చెందిన ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, మహిళా శిశు సంక్షేమశాఖ సంయుక్తంగా స్థానిక మున్సిపల్ ఆఫీసులో మానవ అక్రమ రవాణాపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా హాజరైన వెంకన్న మాట్లాడుతూ మానవ అక్రమ రవాణ తీవ్రమైన నేరమని, ముఖ్యంగా బాలికలు, యువతులు, మహిళలు అక్రమ రవాణా బారినపడి దుర్భర జీవితాన్ని గడుపాల్సి వస్తుందన్నారు. మానవ అక్రమ రవాణా జరుగకుండా అంగన్‌వాడీలు ప్రజల్లో అవగాహనను పెంచాలని కోరారు. షాద్‌నగర్ సీడీపీవో నాగమణి మాట్లాడుతూ సినిమా అవకాశం, ప్రేమ, ఉద్యోగం పేరుతో గుర్తుతెలియని వారు చెప్పే మాటలు నమ్మి జీవితాలను పాడుచేసుకోవద్దని సూచించారు. మాయమాటలు చెప్పే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానం వస్తే ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ బాలరామకృష్ణ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా నిర్మూలన కోసం తమ సంస్థ గత 28 ఏళ్ల నుంచి పోరాటం చేస్తూ, వేలాది మంది అమ్మాయిలను కాపాడి పునరావాసం కల్పించినట్లు తెలిపారు.

ప్రదక్షణల విషయంలో అయోమయానికి గురికావద్దు


మాట్లాడుతున్న అర్చకుడు సీఎస్ రంగరాజన్

మొయినాబాద్, ఆగస్టు 7: తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన కలియుగ దైవం శ్రీ చిలుకూరు బాలాజీ వేంకటేశ్వ దేవాలయంలో లోపల భక్తులు నిర్వహించే ప్రదక్షణల విషయంలో భక్తులు ఎలాంటి అయోమయానికి గురికావాల్సిన అవవసరం లేదని ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్ తెలిపారు. శుక్ర, శని, ఆదివారాల్లో ఆలయం లోపల భక్తులు ప్రదక్షణలు చేసుకునేందుకు అనుమతి లేదని.. ఆ మూడు రోజుల్లో ఆలయం వెలుపల నుంచి మహా ప్రదక్షణలు చేసుకోవచ్చని చెప్పారు. లోపల 11 ప్రదక్షిణలు చేసేవారు బయట ఒక్కటి, 108 చేసే వారు బయట 11 ప్రదక్షణలు చేస్తే స్వామివారి అనుగ్రహం లభిస్తుందన్నారు. మిగతా రోజుల్లో యథావిధిగా ఆలయంలో లోపల ప్రదక్షణలకు అనుమతిస్తామని చెప్పారు. ఆలయం వెనుకాల గల గోశాలలో ప్రతీ శుక్రవారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామని, దాతలు కూడా ముందుకు రావొచ్చని చెప్పారు.

కార్మికులకు గ్రాట్యుటీ చెల్లించండి


హైదరాబాద్‌లోని డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్‌తో చర్చించి వస్తున్న సీసీఐ కార్మిక నాయకులు

తాండూరు రూరల్, ఆగస్టు 7: కరన్‌కోట్‌లోని కేంద్ర ప్రభుత్వ రంగ సీసీఐ కర్మాగారంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు గ్రాట్యుటీ చెల్లించాలని హైదరాబాద్‌లోని అసిస్టెంట్ లేబర్ కమిషనర్(సెంట్రల్) రాఘవేంద్రనాయక్.. సీసీఐ యాజమాన్యాన్ని ఆదేశించారు. బుధవారం కరన్‌కోట్ శివారులోని సీసీఐ ఫ్యాక్టరీ కార్మికులు, సంఘాల నాయకులు, యాజమాన్యం తరఫున హెచ్ఆర్ డిప్యూటీ మేనేజర్ పాల్, కాంట్రాక్ట్ కార్మికులు శరణప్ప, మహదేవ్, రాథోడ్, రమేష్, నబీ, రాములు, శంకర్, సీఐటీయూ నాయకులు లేబర్ కమిషనర్‌తో మాట్లాడారు. 2012లో అప్పటి ఆర్ఎల్‌సీ రీజినల్ లేబర్ కమిషనర్ ఎం.ధర్మరాజు ఆధ్వర్యంలో 1972చట్టం ప్రకారం సీసీఐ కాంట్రాక్ట్ కార్మికులకు, రిటైరైన వారికి, విధుల్లో ఉండి మృతి చెందిన వారికి గ్రాట్యుటీ అందించేందుకు సీసీఐ యాజమాన్యంతో ఒప్పందం కుదిరింది. ప్రస్తుతం 8 మందికే ఇచ్చి మరో 60-70 మందికి ఇవ్వలేదు. ఏళ్లుగా యాజమాన్యాన్ని ప్రశ్నించినా స్పందించకపోవడంతో కార్మికులు అసిస్టెంట్‌లేబర్ కమిషనర్‌ను సంప్రదించారు. ఏఎల్‌సీ రాఘవేందర్‌నాయక్ స్పందిస్తూ కాంట్రాక్ట్ కార్మికులు పనిచేసిన రికార్డులకు సంబంధించి ఎస్-ఫారంను తనకు ఇవ్వాలని, ఆ వివరాలన్నీ పరిశీలించి వడ్డీతో సహా గ్రాట్యుటీ ఇప్పిస్తానని కార్మికులకు హామీ ఇచ్చారు. కార్మికులు దీనికి ఒప్పుకున్నారు.



గ్రామస్తులను వివరాలు అడిగి తెలుసు కుంటున్న డీటీ రఘునందన్‌రావు

రేషన్ దుకాణంలో అవకతవకలపై విచారణ

మాడ్గుల, ఆగస్టు 7 : మండలంలోని సుద్దపల్లి రేషన్ షాపు డీలర్ అవకతవకలకు పాల్పడుతున్నాడనే ఫిర్యాదు మేరకు బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచన రఘునందన్ విచారణ చేపట్టారు. డీలర్ శ్రీను ఈ నెల 5న రేషన్ షాప్‌లో సరుకుల పంపిణీ చేపట్టక పోయినా ఆన్‌లైన్‌లో రేషన్ బియ్యం ఇచ్చినట్లు సమాచారం నమోదైంది. దాంతో డీటీకి గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నాడని పేర్కొన్నారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరడంతో శ్రీనుపై అధికారులు విచారణ చేపట్టారు.

నేటి నుంచి జీపీ కార్మికుల సమ్మె

యాచారం, ఆగస్టు 7 : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నేటి(గురువారం) నుంచి గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మె చేస్తున్నట్లు సీఐటీయూ మండల కార్యదర్శి చందూనాయక్ తెలిపారు. ఈమేరకు బుధవారం ఎంపీడీవో నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. తమ న్యాయమైన డిమాండ్లు తీర్చేదాక సమ్మె కొనసాగిస్తామన్నారు. గత ప్రభుత్వం సమస్యలు తీరుస్తామని ఒప్పుకొని ఏ ఒక్క సమస్య తీర్చలేక పోయిందని, జీవో నెంబర్ 51ను సవరించడంతో పాటు జీవో 60ని తక్షణమే అమలు చేయాలని కోరారు.

‘చేనేత’ పునరుజ్జీవానికి చర్యలు

● కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ● ఆమనగల్లులో ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం ● పాల్గొన్న జిల్లా కలెక్టర్ శశాంక

ఆమనగల్లు/షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 7: కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నేతన్నలకు ప్రోత్సాహకాలు అందించి చేనేతకు పునరుజ్జీవం కల్పించడానికి చర్యలు తీసుకుంటుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. స్వాతంత్ర్య సంగ్రామంలో సాధనంగా నిలిచిన చేనేత.. తెలంగాణ పునర్నిర్మాణంలోనూ ప్రధాన భూమిక పోషిస్తుందని అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని మండల పరిషత్ సమావేశ భవనంలో బుధవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని చేనేత, జౌళిశాఖ ఏడీ ఇందిర ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ శశాంకలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆమనగల్లు చేనేత సంఘం అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్యలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి జాతీయ చేనేత వేడుకలను ప్రారంభించారు. అనంతరం చేనేత కార్మికులు పున్న సత్యనారాయణ, పున్న పురుషోత్తం, వనం యాదమ్మ, చంద్రశేఖర్‌లను ఎమ్మెల్యే, కలెక్టర్‌లు సత్కరించి జ్ఞాపికలు బహూకరించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ ఆమనగల్లులో చేనేత సంఘం నూతన భవన నిర్మాణానికి ఎస్‌డీఎఫ్ ద్వారా అవసరమైన నిధులు మంజూరు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

చేస్తానని హామీ ఇచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సంగ్రామంలో భాగంగా 1905లో జరిగిన స్వదేశీ ఉద్యమం ప్రారంభించిన రోజును జాతీయ చేనేత దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు చెప్పారు. చేనేత రంగానికి పునర్‌వైభవం తీసుకురావడానికి ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకుంటున్నాయన్నారు. అర్హులైన చేనేత కార్మికులకు రుణాలు, పింఛన్లు, ఇళ్లు మంజూరు చేస్తామని, చేనేత వస్త్రాలను ప్రోత్సహించేందుకు ప్రతీ సోమవారం ప్రభుత్వ అధికారులు చేనేత వస్త్రాలు ధరిస్తున్నారని.. జిల్లాలో మరింత ముందుకు తీసుకుపోవడానికి కృషి చేస్తానని తెలిపారు. డీపీవో, మండల ప్రత్యేక అధికారి సుజాత, మున్సిపల్ కమిషనర్ వసంత, తహసీల్దార్ లలిత, ఎంపీడీవో కుసుమ మాధురి, ఎంఈవో సర్దార్‌నాయక్, ఎంపీవో వినోద, పద్మశాలి సంఘం నాయకులు ఎంగిళి బాలకృష్ణ, గుర్రం కేశవులు, అప్పం శ్రీను, ప్రసాద్, శివలింగం, నాయకులు జగన్, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, నిట్ట నారాయణ, విజయ్, శ్రీను నాయక్, విజయ్ రాథోడ్, మెకానిక్‌బాబా, లక్ష్మీ, కృష్ణనాయక్, మైసయ్య, సురేశ్ నాయక్, మల్లేశ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు. షాద్‌నగర్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవం జరుపుకున్నారు. షాద్‌నగర్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు కోట జనార్ధన్ అధ్వర్యంలో స్థానిక పద్మశాలి సంఘ భవనంలో చేనేత కార్మికులైన పాలాది భాస్కర్, గుండాల శేఖర్, ఎంగలి ఆంజనేయులను సన్మానించి అభినందించారు. జనార్ధన్ మాట్లాడుతూ మానవ శరీరానికి రక్షణ, అందం, హోదాను పెంచే వస్త్రాలను తరతరాలకు అందిస్తున్న చేనేత కార్మికుల కృషి అభినందనీయమన్నారు. సంఘం నాయకులు పాలాది నరహరి, బిజ్జుల చిన్నయ్య, సంకూరి బుచ్చయ్య, పానుగంటి అంజయ్య, బాస రాజేందర్, కోట విశ్వనాథం, అద్దెట్ల రాజు, చెరుకు రాములు, వర్కల బాలకృష్ణ తదితరులున్నారు. కేశంపేట మండలం పాపిరెడ్డిగూడలో బీజేపీ షాద్‌నగర్ పట్టణాధ్యక్షుడు హరిభూషన్ ఆ ధ్వర్యంలో చేనేత కార్మికులైన కోట నారాయణ, గుణశేఖర్‌లను సన్మానించారు. బీజేపీ నాయకులు బాల్‌రెడ్డి, శ్యాంసుందర్‌తో పాటు దిడ్డి గోపాల్‌నారాయణ్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్ అర్బన్ : చేనేత కార్మికులను సన్మానిస్తున్న పద్మశాలి సంఘం నాయకులు



కేశంపేట మండలం పాపిరెడ్డిగూడలో కార్మికులను సన్మానిస్తున్న హరిభూషణ్

క్రైం కార్నర్

కల్టివేటర్ నాగళ్ల కింద పడి ఏడేళ్ల బాలుడి మృతి

● తండ్రి పొలం దున్నుతుండగా ఘటన

శంషాబాద్ రూరల్, ఆగస్టు 7: నాన్న ట్రాక్టర్‌తో పొలం దున్నుతుంటే సరదాగా కల్టివేటర్‌పైన కూర్చొన్న కుమారుడు ప్రమాదవశాత్తు ఆ నాగళ్ల కింద పడి ప్రాణాలు కోల్పోయాడు. శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగిన ఈ ఘటనలో ఆశిక్(7) అనే ఏడేళ్ల బాలుడు మరణించాడు. పోలీసుల కథనం ప్రకారం.. శంషాబాద్ మండల పరిధి మదన్‌పల్లి పాత తండాలోని వ్యవసాయ క్షేత్రంలో సంతోష్ వర్మ అనే వ్యక్తి కుటుంబసభ్యులతో కలిసి పని చేస్తున్నాడు. అయితే, వెంకట్‌నాయక్ అనే వ్యక్తి పొలాన్ని ట్రాక్టర్‌తో దున్నేందుకు సంతోష్ బుధవారం వెళ్లాడు. ట్రాక్టర్ నడుపుతుండగా దానికి ఉన్న కల్టివేటర్ నాగళ్లపై అతని కుమారుడు ఆశిక్ కూర్చున్నాడు. ఈక్రమంలో నాగళ్ల కింద పడిన ఆశిక్ తీవ్రంగా గాయపడ్డాడు. ఘటనాస్థలి నుంచి ఆస్పత్రికి తరలిస్తుండగా అతడు మరణించాడు.

బిల్డింగ్‌పై నుంచి కిందపడి తాపీమేస్త్రీ దుర్మరణం

శంషాబాద్ రూరల్, ఆగస్టు 7 : ప్రమాదవశాత్తు బిల్డింగ్‌పై నుంచి కిందపడి తాపీమేస్త్రీ మృతిచెందిన ఘటన శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండలం కొత్తపల్లికి చెందిన ఇప్పపల్లి శ్రీనివాస్(50) బతుకుదెరువు కోసం కొన్నేళ్ల క్రితం శంషాబాద్‌కు వచ్చి అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. మంగళవారం ఉదయం చిన్నగోల్కొండలో కావలి సుభాష్ అనే వ్యక్తి వద్ద పనికి వెళ్లాడు. ఇంటి నిర్మాణ పనుల్లో భాగంగా సజ్జెలు కట్టడానికి బిల్డింగ్‌పైకి వెళ్లాడు. ప్రమాదవశాత్తు కింద పడడంతో తలకు బలమైన గాయాలు కాగా శంషాబాద్‌లోని ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసులకు సమాచారం ఇవ్వకుండానే శవాన్ని సొంత గ్రామానికి తీసుకెళ్లారు. సీఐ నరేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు తిరిగి పోస్టు మార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. మృతుడికి భార్య మాణెమ్మ, కుమారులు హన్మంతు, వెంకటేష్‌లు ఉన్నారని, కుటుంబం పెద్ద దిక్కు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు శోక సముద్రంలో మునిగిపోయారు. ఫిర్యాదును బట్టి ఇంటి యాజమానిపై కేసు నమోదు చేస్తామని సీఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

‘ఎఫ్‌టీఎల్’లో చెత్త వేసిన వ్యక్తులపై కేసు

శంషాబాద్ రూరల్, ఆగస్టు 7 : మున్సిపల్ పరిధిలోని కోత్వాల్‌గూడ హిమాయత్‌సాగర్ చెరువు పరిసరాల్లో(ఎఫ్‌టీఎల్) చెత్తవేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసిన ఘటన బుధవారం ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నగరానికి చెందిన మహ్మద్ హమీద్, మహ్మద్ మహ మూద్‌లు కోత్వాల్‌గూడ హిమాయత్‌సాగర్ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 52లో వ్యర్థాలను పారబోస్తున్నారు. గతంలో హిమాయత్‌నగర్ పంచాయతీ సిబ్బంది హెచ్చరించినా వ్యర్థాలను పారబోస్తూనే ఉన్నారు. దాంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆ ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలింపు.. ట్రాక్టర్ సీజ్

ఆమనగల్లు, ఆగస్టు 7 : మండల పరిధిలోని మేడిగడ్డ తండా వద్ద బుధవారం అక్రమంగా ఇసుక తరలిస్తుండగా ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై వెంకటేషం తెలిపారు. మేడిగడ్డతండాకు చెందిన నేనావత్ రమేష్, తన ట్రాక్టర్‌లో శంకర్‌కొండ తండా వాగులో అక్రమంగా ఇసుకను నింపుకొని ఆమనగల్లు పట్టణానికి తరలిస్తుండగా.. పోలీసులు మేడిగడ్డతండా గేటు సమీపంలో గమనించి పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువతి అదృశ్యం



అక్షయ

షాబాద్, ఆగస్టు 7 : యువతి అదృశ్యమైన ఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని తాళ్లపల్లికి చెందిన మల్లగల్ల మల్లేష్‌కు ముగ్గురు కూతుళ్లు. మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులందరూ కలిసి భోజనం చేసి పడుకున్నారు. అర్ధరాత్రి రెండు గంటల సమయంలో నిద్రలేచి చూడగా చిన్న కూతురు అక్షయ కనిపించలేదు. దాంతో ఆమె వాష్‌రూంకు వెళ్లిందేమోనని వెళ్లి చూడగా కనించలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ దొరకలేదు. అక్షయ ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ వస్తోందని తెలిపారు. నానాజీపురం గ్రామానికి చెందిన సందీప్ తన కూతురిని తీసుకెళ్లి ఉంటాడని తండ్రి మల్లేష్ అనుమానం వ్యక్తం చేసి ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతకు పాటుపడాలి

● స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాల్లో
● అధికారులు, ప్రజాప్రతినిధులు



షాబాద్ : అక్షర స్కూల్ గ్రౌండ్‌లో మొక్క నాటుతున్న ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి



యాచారం : గడ్డమల్లాయగూడలో మొక్కలు నాటుతున్న మహిళలు

కొత్తూర్, ఆగస్టు 7: స్థానిక మున్సిపాలిటీతో పాటు, మండలంలోని ఆయా గ్రామాల్లో స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాలు కొనసాగాయి. మున్సిపాలిటీలోని కాశనకుంట చెరువును మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్యదేవేందర్‌యాదవ్‌తో కలిసి ప్రజాప్రతినిధులు, అధికారులు పరిశీలించారు. చెరువుల పునరుజ్జీవంపై ప్రతిపాదనలు సిద్ధం చేశారు. స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులు పలు పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. పెంజర్ల గ్రామంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి రామారావు మొక్కలు నాటారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీవో విజయలక్ష్మి, మున్సిపల్ వైస్ చైర్మన్ జోలీ రవీందర్, కౌన్సిలర్లు మాదారం నర్సింహ గౌడ్, కమిషనర్ బాలాజీ, నీటిపారుదల శాఖ ఏఈ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ : మొక్కల పెంపకాన్ని ప్రతీ పౌరుడు సామాజిక బాధ్యతగా గుర్తించాలని పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మైసిగండి ఆశ్రమ పాఠశాలలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీనివాస్‌గౌడ్ పాల్గొని మాజీ ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హీరాసింగ్, వసతి గృహ సంక్షేమ అధికారి బాల్‌రాజ్‌తో కలిసి పాఠశాల ఆవరణలో వివిధ రకాల మొక్కలు నాటారు. నాయకులు తులసీరామ్ నాయక్, సీతారామ్, నరేశ్, చందు, రమేశ్, సుదీర్, వినోద్, మైసిగండి స్పెషలాఫీసర్ శ్రీలత, పంచాయతీ కార్యదర్శి జంగయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

యాచారం : మురుగు కాలువలను ప్రతీరోజు శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లుకోవాలని డీఎల్‌పీవో సాధన చెప్పారు. గున్‌గల్, గడ్డమల్లాయగూడ గ్రామాలలో పర్యటించి స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాలను పర్యవేక్షించారు. మురుగు కాలువలను పంచాయతీ సిబ్బందితో శుభ్రం చేయించారు. రోడ్లకిరుపక్కలా మొక్కలు నాటించి ముళ్లకంపను నాటాలని సూచించారు. గున్‌గల్ మోడల్ పాఠశాల బాలికలతో ఎంపీవో శ్రీలత మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని, అటవీ సంపద పెంచడం కోసం విధిగా మొక్కలు నాటి కాపాడుకోవాలని చెప్పారు.

చౌదరిగూడ : పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్థులకు అవగాహన కల్పించాలని జిల్లేడ్ చౌదరిగూడ ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. బుధవారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా చౌదరిగూడ, తూంపల్లి గ్రామాల్లో పనులను పరిశీలించారు. లాల్‌పహాడ్ కేజీబీవీ పాఠశాలలో మొక్కలు నాటారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

షాబాద్ : భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి సూచించారు. నాగర్‌గూడలో అక్షర టాలెంట్ స్కూల్‌లో ప్లేగ్రౌండ్‌ను ప్రారంభించి మొక్కలు నాటారు. కరస్పాండెంట్ రాజు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నర్సింహులుగౌడ్, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

శంకర్‌పల్లి : శంకర్‌పల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే కాలె యాదయ్య తెలిపారు. శంకర్‌పల్లి మున్సిపాలిటీలో మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ఎంపీ నిధులు రూ. 11 లక్షలతో అంతర్గత మురుగు కాలువ పనులకు శంకుస్థాపన, రూ. 41.8 లక్షలతో 4, 5, 11 వార్డులలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన, రూ. 20 లక్షలతో నిర్మించిన పట్టణ నర్సరీ ప్రహరీగోడ ప్రారంభోత్సవం చేశారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. శంకర్‌పల్లి పట్టణ అభివృద్ధికి శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తేవాలని అన్నారు. వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, మేనేజర్ అంజన్‌కుమార్, ఏఈ శ్రీనివాస్, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

షాద్‌నగర్ రూరల్ : పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్య సాధ్యమవుతుందని, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో బన్సిలాల్ తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట, ఎల్లంపల్లి గ్రామాలను సందర్శించారు. గ్రామాల్లో డంపింగ్ యార్డులు, నీటి ట్యాంకులు, మురుగు కాలువలు, సీసీ రోడ్లు, ఇంకుడు గుంతలను పరిశీలించారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

ఆమనగల్లు, ఆగస్టు 7: ఆమనగల్లు పట్టణంలో, పోలెపల్లి ఫీడర్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సీతారామ్ తెలిపారు. ఆమనగల్లు పట్టణ సమీపంలోని 132 కేవీ విద్యుత్ ఉప కేంద్రంలో మరమ్మతుల కారణంగా ఆమనగల్లు ఫీడర్‌లో మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 వరకు, పోలెపల్లి ఫీడర్ల పరిధిలో ఉదయం 8 గంటల నుంచి 11 వరకు అంతరాయం ఉంటుందని చెప్పారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ సర్పంచ్‌లు



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

శంషాబాద్ రూరల్, ఆగస్టు 7: శంషాబాద్ మండలంలోని జూకల్, చౌదర్‌గూడ, పెద్దతూప్రా, పెద్ద తుప్రా తండాలకు చెందిన మాజీ సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు బుధవారం మైలారెడ్డిపల్లిలోని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ నివాసంలో చంద్రారెడ్డి ఆధ్వర్యంలో 200 మంది కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే కండువాలు కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల కార్యకర్తలు, నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు తెలిపారు.

పీఏసీఎస్ అభివృద్ధికి కృషి చేయాలి

శంషాబాద్ రూరల్, ఆగస్టు 7: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధికి కృషి చేయాలని చైర్మన్ బుర్కుంట సతీశ్ తెలిపారు. బుధవారం శంషాబాద్ మండలంలోని మల్కారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో పాలక వర్గ సభ్యులతో సమావేశం నిర్వహించారు. సంఘంలో నూతనంగా 11 మంది రైతులకు దీర్ఘకాలిక రుణాలు రూ.41,25,000 మంజూరు, 211 మందికి రూ.1,20,49,545 రుణమాఫీ అయినట్లు తెలిపారు. మాఫీ కాని 178 మంది దరఖాస్తు చేసుకోవాలన్నారు. దీర్ఘకాలిక అప్పులు చెక్కులను పంపిణీ చేశారు. డైరెక్టర్లు హెచ్.శివాజీ, లక్ష్మీకృష్ణారెడ్డి, సత్తయ్య, మొహ్మద్ వాజీద్ ఖాన్, సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని ప్రత్యేక పూజలు



మల్కారంలో పూజలు నిర్వహిస్తున్న రైతులు

శంషాబాద్ రూరల్, ఆగస్టు 7 : వర్షాలు కురవాలని మండల పరిధిలోని మల్కారంలో రైతులు బుధవారం వరద పాశం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొన్ని రోజులుగా శంషాబాద్ మండల పరిధిలో వర్షాలు కురువడం లేదని గ్రామానికి చెందిన రైతు శ్రీరాములు ఆధ్వర్యంలో వందల మంది రైతులు గ్రామ శివారులో ఉన్న మల్కారం వాగు కత్వ దగ్గర వరద పాశం పూజలు నిర్వహించారు. గతేడాది వర్షాలు పుష్కలంగా కురిసినా.. ఈ ఏడాది తగినంత పడకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని అవేదన వ్యక్తం చేశారు. వరుణ దేవుడు కరుణించి వర్షాలు కురువాలని వేడుకున్నట్లు శ్రీరాములు తెలిపారు. రైతులు యాదయ్య, ఆంజనేయులు, నర్సింహ, విష్ణువర్ధన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, పి. యాదయ్య, శ్రీనివాస్‌గౌడ్, పోచయ్య, శేఖర్, రమేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు వేళలు మార్చండి

మంచాల, ఆగస్టు 7 : బండలేమూర్ అజినాతండాకు వచ్చే బస్సు వేళలు మార్చాలని మాజీ సర్పంచ్ పోచమోని కృష్ణ ఆర్టీసీ అధికారులను కోరారు. ఈ మేరకు బుధవారం ఇబ్రహీంపట్నం డిపోమేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. అజినాతండాకు వచ్చిపోయే బస్సు సమయానుకూలంగా లేకపోవడంతో విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదనంగా ఉదయం పూట మరో బస్సు సర్వీసును నడపాలన్నారు. చెన్నారెడ్డిగూడ నైట్‌హాల్ట్ బస్సును పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు.

ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలి

చేవెళ్ల, ఆగస్టు 7 : విద్యార్థులు ఎక్కువగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయులను భర్తీ చేయాలని జిల్లా అధ్యక్షుడు ఎస్.నర్సింహ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో గవర్నమెంట్ టీచర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎస్.నర్సింహ, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్, కోశాధికారి యాదిలాల్, ఉపాధ్యక్షుడిగా డి.ప్రభు, తదితరులను ఎన్నుకున్నారు.

ఉపాధ్యాయుల సేవలు మరువలేనివి

షాద్‌నగర్, ఆగస్టు 7: ఉపాధ్యాయులు సేవలు మరువలేనివని కుంటబడి జీహెచ్‌ఎం భగమ్మ అన్నారు. పాఠశాలలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను బుధవారం పాఠశాలలో సత్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో వారికి ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుని కన్నీటి పర్యంతమయ్యారు. జీహెచ్‌ఎం భగమ్మ బదిలీపై వెళ్లిన వారికి పూలమొక్కలను బహుమతిగా అందించారు.

పని తీరుతోనే ప్రజల్లో కీర్తి

కడ్తాల్, ఆగస్టు 7: పనితీరుపైనే ప్రభుత్వ ఉద్యోగులకు ప్రజల్లో గుర్తింపు లభిస్తుందని మైసిగండి మైసమ్మ దేవాలయ ఫౌండర్ ట్రస్టీ రామావత్ సిరోలిపంతూ, ఈవో స్నేహలతలు అన్నారు. అంకిత భావంతో విధులు నిర్వర్తించే ఉద్యోగులు ప్రజల అభిమానం పొందుతారని తెలిపారు. కడ్తాల మండలం మైసిగండి మైసమ్మ దేవాలయంలో ఏళ్ల కాలంగా సేవలందించి బదిలీ అయిన సీనియర్ అసిస్టెంట్ బోడ్యనాయక్, పి. మల్లేశ్, జూనియర్ అసిస్టెంట్లు దేవేందర్ రెడ్డి, రమాదేవి లు వివిధ దేవాలయాలకు బదిలీ అయ్యారు. బుధవారం ఆలయ ఆవరణలో వారికి వీడ్కోలు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. మైసిగండి మైసమ్మ దేవాలయానికి వారందించిన సేవలను కొనియాడారు. రామావత్ భాస్కర్, మాదారం యాదగిరి, కృష్ణ, చంద్రయ్య, రాములు, శ్రీనివాసులు, శ్రవణ్ కుమార్, విజయ్‌కుమార్, మహేశ్, పత్యనాయక్, హర్షవర్ధన్, వెంకటేశ్, ఆనంద్, తదితరులు ఉన్నారు.

మాజీ ఎంపీటీసీకి జైపాల్ యాదవ్ పరామర్శ



మృతుని కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

కడ్తాల్, ఆగస్టు 7: మండల పరిధిలోని సాలార్‌పూర్ గ్రామ మాజీ ఎంపీటీసీ సాయిలు కుమారుడు కావలి గణేశ్ అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం మృతదేహాన్ని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డిలు సందర్శించి నివాళులర్పించారు. సాయిలును ఓదార్చారు. బాధిత కుటుంబానికి జైపాల్‌యాదవ్ రూ.10 వేలు, దశరథ్ నాయక్, వెంకటేశ్, లక్ష్మీనర్సింహారెడ్డి రూ.5వేల చొప్పున, మాజీ ఎంపీటీసీ ప్రియరమేశ్ రూ.3వేలు ఆర్థికసాయం చేశారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఆమనగల్లు, ఆగస్టు 7:యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి జీవితాలను ఉన్నతంగా మలుచుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి. జగన్ పిలుపు నిచ్చారు. గంజాయి రహిత సమాజ స్థాపనకు ప్రభుత్వాలు చేస్తున్న కృషిలో ప్రతీఒక్కరు పాలు పంచుకోవాలని కోరారు. ఆమనగల్లు పట్టణంలో బుధవారం డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డ్రగ్స్, గంజాయి నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో కలిసి ప్రధాన రహదారులపై ర్యాలీ చేపట్టారు. డ్రగ్స్, గంజాయిని అరికడుదాం, ఆరోగ్య తెలంగాణను సాధిద్దామంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. స్థానిక రాజీవ్ చౌక్‌వద్ద నిర్వహించిన సమావేశంలో జిల్లా కార్యదర్శి జగన్ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసలుగా మారి విద్యార్థులు, యువత తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పి.శివశంకర్, నాయకులు ఆలంపల్లి జంగయ్య, వినోద్, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

కేశంపేట : కొత్తపేటకు చెందిన రొయ్యల లక్ష్మయ్య బుధవారం మృతిచెందాడు. మాజీ సర్పంచ్ కామ్లేకర్ నవీన్ కుమార్, మాజీ ఎంపీటీసీ మల్లేష్ యాదవ్, మాజీ కో-ఆప్షన్ సభ్యులు జమాల్‌ఖాన్, పోచారం జగన్‌రెడ్డిలు అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందించారు. అలాగే కాకునూర్‌కు చెందిన వడ్ల బ్రహ్మచారి బుధవారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు తైద పర్వతాలు, కోడూరు రాములు, శ్రీశైలం, రవీందర్‌గౌడ్, నర్సింలు, నరేందర్ రెడ్డి, భీమయ్యలు ఆర్థిక సాయం చేశారు.

షాబాద్ : కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో చేవెళ్లలో నిర్వహించిన ఎస్సీ డిక్లరేషన్‌లకు నిధులు కేటాయించాలని ఎస్సీమోర్చా మండల అధ్యక్షుడు మహేందర్ డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ కృష్ణయ్యకు వినతిపత్రం ఇచ్చారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కిరణ్, రాము, సత్యం, తదితరులున్నారు.

కడ్తాల్ : మక్తమాదారంలోని శ్రీ రుక్మిణిసత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో తిరునక్షత్రోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయంనుంచి సాయంత్రం వరకు పూజలు కొనసాగాయి. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ అనువంశిక ధర్మకర్త తిరుమల వింజమూరు రామానుజాచార్యులు, అర్చకులు, నాయకులున్నారు.

కడ్తాల్ : బాధిత కుటుంబాలకు జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ అండగా ఉంటుందని మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. సాలార్‌పూర్, చరికొండ, కడ్తాలలో పర్యటించారు. సాలార్‌పూర్‌లో అనారోగ్యంతో మృతిచెందిన గణేశ్, కడ్తాల మండల కేంద్రానికి చెందిన జంగమ్మ, చరికొండకు చెందిన సత్తయ్య, చంద్రమ్మ కుటుంబాలను పరామర్శించారు. ట్రస్ట్ ద్వారా ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున రూ. 20 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

మాడ్గుల : మాడ్గుల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈనెల 5న రాత్రి సమయంలో కర్ణాటకకు చెందిన ఓ గర్భిణీ పురిటినొప్పులతో మండల పరిషత్ కార్యాలయ సమీపాన బాధపడుతుండగా.. గస్తీ పోలీసులు స్థానిక మహిళల సహాయంతో పురుడుపోసి గొప్ప మనసు చాటుకున్నారు. మహిళలు దుబ్బాక సంగమ్మ, వరికుప్పల భారతమ్మలతో పాటు పోలీసులను రాచకొండ సీపీ సుధీర్‌బాబు సత్కరించారు.

శంషాబాద్ : వయనాడ్ బాధితులకోసం ఏపీటీయూసీ రంగారెడ్డి జిల్లా శాఖ విరాళాలు సేకరించింది. రూ.20 వేల నగదును ఐఏటీయూసీ కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రయ్యలకు జిల్లా ప్రధాన కార్యదర్శి పర్వతాలు, జిల్లా అధ్యక్షుడు రామస్వామి కార్యదర్శి దత్తూనాయక్, మల్లేష్‌లు అందజేశారు.

ఆమనగల్లు : విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని లక్ష్యసాధనకు పట్టుదలతో ముందుకు సాగాలని ఎంపీడీవో కుసుమ మాధురి అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జ్ఞానవాహిని ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బుధవారం వక్తృత్వ పోటీలు నిర్వహించారు. 6,7 తరగతుల విద్యార్థులకు అమ్మనాన్నలతో నా అనుబంధం, 8,9,10 తరగతుల విద్యార్థులకు నా జీవితంలో గురువు యొక్క ప్రాముఖ్యత అనే అంశాలపై నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన 60మంది విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం

● పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్‌రెడ్డి

కడ్తాల్, ఆగస్టు 7: ప్రభుత్వ విద్యారంగం బలోపేతంతో పాటు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పీఆర్టీయూ రాజీలేని పోరాటాలు కొనసాగిస్తుందని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సామల మహేందర్‌రెడ్డి అన్నారు. ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు రూల్స్ సాధించి ఉపాధ్యాయులకు ఎంఈవో, జేఎల్, డైట్ అధ్యాపకులుగా పదోన్నతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కడ్తాల మండలం కడ్తాల, మక్తమాదారం, రావిచెడ్, ముద్విన్ జిల్లా పరిషత్ ఉన్నత, కేజీబీవీ, యూపీఎస్, పీఎస్ పాఠశాలల్లో బుధవారం పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల శాఖ అధ్యక్షుడు రాధాకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి పద్మావతమ్మలతో కలిసి సభ్యత్వ నమోదును ప్రారంభించారు. రాష్ట్ర బాధ్యులు నరోత్తమ్‌రెడ్డి, జిల్లా బాధ్యులు కొండల్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్ రెడ్డి, శ్రవణ్‌కుమార్ రెడ్డి, రామ్మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

నల్లచెర్వు అభివృద్ధికి నిధులు కేటాయించండి

మాడ్గుల, ఆగస్టు 7 : మండలంలోని నల్లచెర్వు గ్రామ అభివృద్ధికి నిధులు కేటాయించాలని గ్రామస్తులు కోరారు. ఈమేరకు బుధవారం నగరంలోని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నివాసంలో ఆయన్ను కలిసి వినతిపత్రం అందచేశారు. సీసీ రోడ్లు, మురుగు కాల్వల మరమ్మతులకు నిధులు కేటాయించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. వడ్డేపల్లి నవీన్‌గౌడ్, కృష్ణయ్య, శ్రీశైలం, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల దాడిని నిరసిస్తూ న్యాయవాదుల ఆందోళన



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న బార్ అసోసియేషన్ సభ్యులు

ఆమనగల్లు, ఆగస్టు 7: జనగామ జిల్లాలో బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు గద్దల అమృతరావు, కవితలపై పోలీసుల దాడిని నిరసిస్తూ ఆమనగల్లు పట్టణంలో బుధవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లే జగన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట కొద్దిసేపు ధర్నా నిర్వహించారు. కోర్టు ఎదుట బైటాయించి నిరసన తెలిపారు. నిరసన కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి దుడ్డు ఆంజనేయులు, సీనియర్ న్యాయవాది అండేకార్ యాదిలాల్, కార్యదర్శి రామకృష్ణ, కోశాధికారి మధు, లైబ్రేరియన్ శేఖర్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

మండల వ్యవసాయాధికారి రాఘమ్మ బదిలీ



మొయినాబాద్, ఆగస్టు 7: మండల వ్యవసాయ అధికారి రాఘమ్మ బుధవారం బదిలీ అయ్యారు. వ్యవసాయశాఖలో ఇటీవల ఉన్నతాధికారుల స్థానచలనాల్లో భాగంగా ఆమె రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ పరిశోధన కేంద్రానికి బదిలీపై వెళ్లారు. రాఘమ్మ మండల వ్యవసాయ అధికారిగా సుమారు 14 సంవత్సరాల పాటు సుదీర్ఘకాలం పనిచేసిన అనుభవం ఉంది. ఆమె స్థానంలో రాజేంద్రనగర్ పరిశోధన కేంద్రంలోని ఇతర విభాగంలో పనిచేసే అనురాధ ఇక్కడికి రానున్నారు.